రేపటి నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే

ఎన్యూమరేటర్ల శిక్షణ శిబిరంలో డీసీ మారుతీ దివాకర్

శిక్షణకు హాజరైన ఎన్యూమరేటర్లు

అంబర్‌పేట, నవంబర్ 4 : జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్ పరిధిలో సమగ్ర ఇంటింటి కుటుంబ (సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల) సర్వే నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు ఇంటింటి సర్వేను చేపట్టే ఎన్యూమరేటర్లకు ఇప్పటికే మూడుసార్లు శిక్షణ ఇచ్చారు. సర్వేలోని అంశాల ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక, సంక్షేమ పథకాల అమలు, నిధుల కేటాయింపు జరుగుతుందని సమాచారం. మున్ముందు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోయే అన్ని కార్యక్రమాలకూ దీనినే ప్రామాణికంగా తీసుకోనున్నట్లు తెలిసింది.

సర్కిల్ పరిధిలో..

సర్కిల్ పరిధిలో మొత్తం 6 డివిజన్లున్నాయి. మొత్తం 90వేల నివాసాలు, 2.80లక్షల ఓటర్లు ఉన్నారు. సర్వే కోసం 720 మంది ఎన్యూమరేటర్లు నియమితులయ్యారు. ఒక్కో ఎన్యూమరేటర్‌కు 150 ఇండ్లను కేటాయించారు. అంబర్‌పేట నియోజకవర్గంలోని కాచిగూడ, నల్లకుంట, గోల్నాక, అంబర్‌పేట, బాగ్ అంబర్‌పేట డివిజన్లు, ఖైరతాబాద్ నియోజకవర్గంలోని హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలో ఈ సర్వేను చేపట్టనున్నారు. ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నిర్దేశించిన సమగ్ర వివరాలను సేకరించనున్నారు.

56 అంశాలతో దరఖాస్తు..

ఈ నెల 6 నుంచి మొదలయ్యే సర్వే 21వ తేదీ వరకు కొనసాగనున్నది. ఈ సర్వేలో పాల్గొనే ఎన్యూమరేటర్లకు నారాయణగూడలోని రెడ్డి మహిళా కళాశాలలో ఇప్పటికే శిక్షణను ఇచ్చారు. మరో దఫా శిక్షణను సోమవారం అంబర్‌పేటలోని మహారాణా ప్రతాప్ ఫంక్షన్‌హాల్‌లో ఇచ్చారు. డీసీ మారుతీ దివాకర్, డీపీఓ రజిత, అధికారులు పాల్గొన్నారు. సర్వేను చేసే విధానాన్ని, ముఖ్యమైన అంశాలను ఎన్యూమరేటర్లకు వివరించారు. సర్వేలో భాగంగా ఎన్యూమరేటర్లు ప్రతి కుటుంబానికి సంబంధించి పూర్తి వివరాలను సేకరించనున్నారు. ఇందుకు నిర్దేశిత సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులం తదితర 56 అంశాలతో కూడిన దరఖాస్తు ఫారాన్ని పూరించాల్సి ఉంటుందని చెప్పారు.

సర్వేకు అందరూ సహకరించాలి
- మారుతీ దివాకర్, డీసీ, అంబర్‌పేట సర్కిల్

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలంతా సమకరించాలి. ఇంటింటికి వచ్చే ఎన్యూమరేటర్లకు వాస్తవాలతో కూడిన పూర్తి సమాచారాన్ని ఇవ్వాలి. సర్వే కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగింది. ఈ నెల 6వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఈ సర్వే జరుగుతుంది.

యాదవుల పేరు చివరన యాదవ్ అని చేర్చాలి

రవీంద్రభారతి : కులగణన సర్వేలో యాదవుల పేరు చివరన యాదవ్ అని చేర్చాలని తెలంగాణ యాదవ విద్యావంతుల వేదిక విజ్ఞప్తి చేసింది. డెడికేటెడ్ బీసీ కమిషన్‌కు విన్నవించినట్లు విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు చలకాని వెంకట్ యాదవ్ తెలిపారు. కులగణన కాలమ్‌లో గొల్ల తదితర ఉపకులాలను చేర్చకుండా యాదవ్ అని చేర్చడంతో పాటు పేరు చివరన కూడా యాదవ్ అని రాసేందుకు సిబ్బందికి ఆదేశాలు ఇవ్వాలని బీసీ కమిషన్‌కు విన్నవించారు. కార్యక్రమంలో వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డాక్టర్ దూదిమెట్ల శ్రీనివాస్‌యాదవ్, అచ్యుత యాదవ్ పాల్గొన్నారు.

గాంధీ భవన్‌లో సమావేశం

గాంధీ భవన్‌లో కులగణన సర్వేపై డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, సీనియర్ నాయకులు వి.హనుమంత్ రావు, ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్, నాంపల్లి కాంటెస్టెడ్ ఎమ్మెల్యే ఫిరోజ్ ఖాన్, డీసీసీ ఖైరతాబాద్ ప్రధాన కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్ లోధ్ పాల్గొన్నారు. - అబిడ్స్

ఆకట్టుకున్న నృత్యప్రదర్శన

సౌత్ ఇండియా కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ సికా 66వ వార్షికోత్సవం సందర్భంగా రవీంద్ర భారతిలో విశిష్ట డింగరి భరత నృత్యం ప్రదర్శించారు. విశిష్ట డింగరి మూడేండ్ల నుంచి భాస్కర్‌రావు వద్ద విద్యను అభ్యసించింది. 15 ఏండ్ల నుంచి ప్రఖ్యాత నాట్యగురువు డాక్టర్ జయశ్రీ రాజ్‌గోపాలన్ వద శిక్షణ పొందుతున్నారు. పరమ గురువులు డాక్టర్ పద్మవిభూషణ్, పద్మ సుబ్రహ్మణ్యం , ప్రముఖ నాట్య గురువులు జయశ్రీ రాజ్‌గోపాలన్ శిష్యురాలైన విశిష్ట డింగారి ప్రదర్శన ఆకట్టుకున్నది. - రవీంద్రభారతి

వీరశైవ లింగాయత్‌లు రాజకీయంగా ఎదగాలి

వీర శైవ లింగాయత్‌లు రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉందని రాష్ట్ర వీరశైవ ధర్మ ప్రచార సమితి ఉపాధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది కడ్లి రాజశేఖర్ అన్నారు. సోమవారం కోఠిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వీర శైవ లింగాయత్ కులానికి చెందిన వారమని బలిజ, లింగాయత్ అని ఇంకా ఇతర పేర్లను తెలుపవద్దని సూచించారు. వీర శైవ లింగా యత్‌లను కొన్ని ప్రాంతాల్లో లింగాయత్, బలిజ, వాణి అని పిలుస్తారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోని ఆంధ్రా ప్రాంతంలో బలిజలు ఉన్నారని తెలంగాణలో బలిజలు లేరన్నారు. సమావేశంలో సమితి అధ్యక్షుడు దిగంబర రావు, రాష్ట్ర ఫెడ రేషన్ నాయకులు సులుగంటి సిద్దేశ్వర్, నర్సింహులు, ముక్తా శ్రీశైలం, నీలప్ప, సంజయ్ పాల్గొన్నారు. - అబిడ్స్

ఆలయాలపై దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలి

అంబర్‌పేట : సికింద్రాబాద్ కుర్మగూడలోని ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహం ధ్వంసం ఘటనను ఖండిస్తూ దేశంలో ఆలయాలపై దాడులు జరగకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సనాతన హిందూ దేవాలయ పరిరక్షణ సమితి రాష్ట్ర చైర్మన్ పుట్టి యాదగిరి, అధ్యక్షుడు యమన్‌సింగ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గోల్నాకలోని సమితి కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. ఆలయంపై జరిగిన దాడిని అఘోరి మాత విచ్చేసిన తర్వాత ఆలయాన్ని కట్టాలని చెప్పగా అందరు సంకల్పం చేసుకొని కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారన్నారు.

కంటితుడుపు చర్యగా ప్రజావాణి



విలేకరులతో మాట్లాడుతున్న గోషామహల్ బీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్ : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని కంటి తుడుపు చర్యగా చేపడుతుందని, సమస్యలను తెలిపేందుకు అధికారులకు వద్దకు వస్తే కార్యాలయంలో ఎవరూ ఉండటం లేదని గోషామహల్ బీఆర్ఎస్ నాయకుడు ఎం. ఆనంద్‌కుమార్ గౌడ్ విమర్శించారు. సోమవారం గోషామహల్ సర్కిల్ – 14 కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ విద్యాధర్‌ను కలిసి సమస్యలపై చర్చించారు. పదేండ్లలో బీఆర్ఎస్ హయాంలో ఒక్క ధర్నా లేదని, సమస్య లేకుండా పాలన చేసిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒక్క పని జరుగలేదని ఆరోపించారు. పేద వాడు ఇంటి నిర్మాణం జరుపుకుంటే కూ ల్చేందుకు అధికారులు రావడం దుర్మార్గమన్నారు. అదే బిల్డర్లు నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలు అధికారుల కంటికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు.ప్రజావాణి పేరుతో ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారే తప్ప సమస్యలను పట్టించుకోవడం లేదని వాపోయారు. ట్యాక్స్ ఆఫీసర్ అనిల్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించాలని లేని పక్షంలో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. నరేశ్ గౌడ్, విజయ్ ము దిరాజ్, ఖైసర్, సాత్, మహ్మద్ అహ్మ ద్,గౌస్, జహంగీర్, యూసుఫ్ పటేల్, మౌ లానా జహంగీర్, ఫిర్దౌస్, ఇక్బాల్ పాల్గొన్నారు.

వానాకాలంలోపు అందుబాటులోకి తేవాలి



మూసారాంబాగ్ హై లెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు

గోల్నాక, నవంబర్ 4 : యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి వానాకాలంలోపు మూసారాంబాగ్ హై లెవల్ బ్రిడ్జి పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అధికారులను ఆదేశించారు. సోమవారం అంబర్ పేట అలీ కేఫ్ చౌరస్తా నుంచి మూసారాంబాగ్ వరకు రూ.52 కోట్లతో ఏర్పాటు చేస్తోన్న హై లెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులను కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్, అధికారులతో కలసి పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన భూమిని వీలైనంత త్వరగా సేకరించాలని సూచించారు. బ్రిడ్జి నిర్మాణంలో జాప్యం జరుగడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నిర్మాణంలో సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని, ఇందుకు పలుశాఖల అధికారులు రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. వేగం పెంచి సకాలంలో పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ నార్త్ జోన్ ప్రాజెక్ట్ విభాగం అధికారులు రోహిణి, రేణుక, ప్రశాంత్, జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు రమేశ్ బాబు, ప్రశాంతి, పవన్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ స్కూల్స్, కళాశాల అభివృద్ధికి కృషి

సమావేశంలో మాట్లాడుతున్న టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ మహ్మద్ ఒబేదుల్లా కొత్వాల్

అబిడ్స్ : తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్, కళాశాల అభివృద్ధికి టీజీఎంఎఫ్‌సీ కృషి చేస్తుందని తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మహ్మద్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. సోమవారం నాంపల్లి హజ్ హౌస్ కార్పొరేషన్ కార్యాలయంలో 7వ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. కార్పొరేషన్ ఆర్థిక నివేదికలపై చర్చించడంతో షేర్ హోల్డర్లు ఆమోదించడం అభినందనీయమన్నారు. యూనిఫాం కుట్టు కేటాయింపునకు గాను మైనార్టీ కమ్యూనిటీ గార్మెంట్స్ ఉత్పత్తి, శిక్షణ కేంద్రాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఎన్‌జీవోలు సూచించిన ప్రకారం కంప్యూటరైజ్డ్ ఎంబ్రాయిడరీ కుట్టుమిషన్లు, ఓవర్‌లాక్ మిషన్లు కేటాయించామన్నారు. యూనిఫాంకు రూ.75 నుంచి రూ. 100 పెంచాలని ఆయన వీసీ అండ్ ఎండీకి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో టీజీఎంఎఫ్‌సీ వీసీ, మేనేజింగ్ డైరెక్టర్ ఏ కాంతి వెస్లీ, ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ సెక్రటరీ ఆర్ రవి, ఇతర అధికారులు,షేర్ హోల్డర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ..ప్రభుత్వ పథకాలు

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. సోమవారం టోలిచౌకి సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 85 కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, నానల్ నగర్ కార్పొరేటర్ ఎండీ.నసీరుద్దీన్, ఎంఐఎం నాయకులు మహ్మద్ హరూన్ ఫర్హాన్, అమీర్ పాల్గొన్నారు. - మెహిదీపట్నం

అయ్యప్పస్వాములకు అన్నదానం

అయ్యప్ప దీక్ష మాలాధారుల కోసం ప్రతి సంవత్సరం మెహిదీపట్నంలో ఏర్పాటు చేసే అన్నదాన కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. మెహిదీపట్నం ఆర్టీసీ డిపో వెనుక వైపు రాజరాజేశ్వరి ఆలయం కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించే ఈ అన్నదాన కార్యక్రమం జనవరి 1 వరకు ఉంటుందని నిర్వాహకులు అల్లాడ అప్పారావు గురుస్వామి, ఉయ్యూరు శ్రీకాంత్ తెలిపారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 12 :30 నుంచి 3 గంటల వరకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని,అయ్యప్ప మాలాధారులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. - మెహిదీపట్నం

గోల్కొండ హోటల్‌లో కేక్ మిక్సింగ్

మాసాబ్‌ట్యాంక్‌లోని గోల్కొండ హోటల్‌లో సోమవారం సంప్రదాయ కేక్ మిక్సింగ్ వేడుక నిర్వహించారు. సినీ నేపథ్య గాయని ఎస్.పి.శైలజ, సీనియర్ నటుడు శుభలేఖ సుధాకర్ ముఖ్యఅతిథులుగా విచ్చేసి కేక్ మిక్సింగ్ కార్యక్రమంలో గోల్కొండ హోటల్ ఎగ్జిక్యూటివ్ షెఫ్ వెంకట్ , సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. - మెహిదీపట్నం

పూడికతీత పరిశీలన

బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని నందరాజ్ నగర్, మం దుల బస్తీల్లో వర్షపునీరు కచ్చామోరీ పూడికతీత పనులను కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి సోమవారం పరిశీలించారు. ఎక్కడ కూడా పూడిక లేకుండా తీసివేయాలని సూచించారు. జీహెచ్ఎంసీ ఏఈ మనీషా, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి పాల్గొన్నారు. - అంబర్‌పేట

ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఉండాలి

కేంద్ర ప్రభుత్వం ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, ఓబీసీలపై ఉన్న క్రిమిలేయర్ విదానాన్ని రద్దు చేయాలని జాతీయ ఓబీసీ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. నేడు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను అఖిల భారత ఓబీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో యు.చిన్నయ్య, శ్రీనివాస్‌గౌడ్, రవి కుమార్‌ముదిరాజ్,యాకయ్యగౌడ్, మల్లేశ్‌యాదవ్, మదన్ పాల్గొన్నారు. - కాచిగూడ

కిచెన్‌లో జారిపడి వ్యక్తి మృతి

కాచిగూడ, నవంబర్ 4: కిచన్‌లో జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో జరిగింది. ఎస్సై పి.రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నింబోలిఅడ్డాకు చెందిన విష్ణు కుమారుడు సాయినాథ్ (41) తాగినమైకంలో గత నెల 30న ఇంట్లో కిచన్‌లో జారిపడడంతో తలకు తీవ్రంగా గాయమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సాయి నాథ్‌ను చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం గాంధీ దవాఖానలో మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మరోచోట వృద్ధుడు..

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందాడు. కాచిగూడ హెడ్‌కానిస్టేబుల్ చిమ్నానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డికి చెందిన రాజయ్య కుమారుడు జేడీ సిద్దయ్య(72) ఆదివారం విద్యానగర్ రైల్వేస్టేషన్‌లో రైల్లోంచి జారిపడంతో తీవ్రంగా గాయపడి ఉన్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సిద్దయ్యను మెరుగైన చికిత్స నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మెహిదీపట్నం, నవంబర్ 4 : విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా ఆసిఫ్‌నగర్ సబ్‌డివిజన్ పరిధిలోని 11 కేవీ పెన్షన్‌పురా ఫీడర్,11 కేవీ ఫతేదర్వాజ ఫీడర్,11 కేవీ కంపెనీ బాగ్ ఫీడర్ ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మెహిదీపట్నం సీబీడీ ఏడీ ఓ ప్రకటనలో తెలిపారు.ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు లంగర్‌హౌస్ క్రాస్ రోడ్, పెన్షన్ పురా, గొల్లబస్తీ, బాగ్దాద్ కాలనీ, అహ్మద్ కాలనీ, కంపెనీ బాగ్, మిలిటరీ హాస్పిటల్, ఇందిరా నగర్, ఫ్లోర్ మిల్ ప్రాంతాలు, మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు ఫతే దర్వాజ, ఛోటాబజార్, సెంట్రల్ బ్యాంక్, గోల్కొండ మ్యూజియం, పోస్టాఫీస్, 7 గల్లీ, బడాబజార్, ధాన్ కోట, సాలెనగర్ కంచ ప్రాంతాలు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మోతి దర్వాజ, షాంగ్రిల్లా హైస్కూల్, అఫ్సర్ కాలనీ, కంపెనీ బాగ్, అహ్మద్ కాలనీ, బాగ్దాద్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

7 నుంచి హిందూ ఆధ్యాత్మిక సేవా మేళా

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హిందూ ఆధ్యాత్మిక, సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్,కార్యదర్శి రామ్ మూర్తి

సుల్తాన్‌బజార్ : హిందూ ఆధ్యాత్మిక, సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి 10 వరకు నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో హిందూ ఆధ్యాత్మిక సేవా మేళాను నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్,కార్యదర్శి రామ్ మూర్తి పేర్కొన్నారు. సోమవారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానం ప్రాంగణంలోని కమలా నెహ్రూ పాలిటెక్నిక్ కళాశాల సమావేశ మందిర ంలో వారు ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు వారు మాట్లాడుతూ 7 న ఎగ్జిబిషన్ మైదానంలో సాయంత్రం ఆరు గంటలకు త్రిదండి శ్రీ మన్నారాయణ రామానుజ చిన జీయరు స్వామి, రామకృష్ణ మఠ్ స్వామిజీ శితికంఠానంద, ఏపీ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్‌వీ సుబ్రమణ్యం చేతుల మీదుగా సేవా మేళా ప్రారంభమవుతుందన్నారు. చెన్నై, బెంగళూరు, తిరువనంతపురం, గురుగ్రామ్, జైపూర్, ఇండోర్, ముంబాయి, రాయ్‌పూర్, భువనేశ్వర్, రాంచీతో పాటు అనే క ప్రాంతాల్లో హిందూ ఆధ్యాత్మిక సేవా మేళాలను నిర్వహించడం జరిగిందన్నారు. తెలంగాణ రా ష్ట్రంలోని హైదరాబాద్ నగరంలో మొట్టమొదటి సారి ఈ మేళా ను నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు. 10వ తేదిన ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు పరమవీర చక్ర అవా ర్డు గ్రహీత సుబేదార్ మేజర్ యోగేంద్ర యాదవ్ పరమవీర్ వందన్ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తారన్నారు.

కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు కె. శ్రీకాంత్‌రెడ్డి, కోశాధి కారి విక్రమ్ సింహ,కో కన్వీనర్లు డాక్టర్ శ్రవణ్ కుమార్,ఆర్.రామ్‌రెడ్డి,వి. సురేశ్,ఎం. పద్మజ పాల్గొన్నారు.

టెండర్ టైం పొడిగించకుండా రద్దు చేయాలి

ఏఎంఎస్ టెండర్ టైంను రెండేండ్లు పొడిగించకుండా ప్రభుత్వం రద్దు చేయాలని పొల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం ఏఐసీసీ కార్యాలయంలో ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌కు వినతి పత్రం సమర్పి ంచారు. ఏఎంఎస్ టెండర్ టైంలో గత ప్రభుత్వం పెట్టిన రెండేండ్ల విధానాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసి ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం, కాంగ్రెస్ హయాంలో కొనసాగిన పాత విధానాన్ని అమల్లోకి తీసుకురావాలని సీఎం దృష్టికి తీసుకువెళ్లినా..ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. - అబిడ్స్

కరాటే నేర్చుకోవడానికి ముందుకు రావాలి

కరాటే నేర్చుకోవడానికి విద్యార్థులు ముందుకు రావాలని, చదువుతో పాటు కరాటే అవసరమని తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ అభినందకుమార్ అన్నారు. జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో 19వ నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ – 2024 కరాటే పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులను హైకోర్టు జడ్జి జస్టిస్ అభినందకుమార్, జైళ్ల శాఖ డీజీపీ డాక్టర్ సౌమ్యమిశ్రా అభినందించారు. కార్యక్రమంలో జస్టిస్ లక్ష్మీ నారాయణ, జీవీఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ జీఎస్ గోపాల్‌రెడ్డి,అమృత రెడ్డి, గణ సంతోషినిరెడ్డి పాల్గొన్నారు. - కాచిగూడ

విద్యతోనే అంతులేని జ్ఞానం

కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు, అరోరా కాలేజీ అధ్యాపకులు

రవీంద్రభారతి, నవంబర్ 4: విద్య అంతులేని జ్ఞానం వస్తుందని అకాడమిక్ అడిట్ డైరెక్టర్ ప్రొ. బి.శ్రీనగేశ్, విశిష్ట అతిథి నగర అదనపు ట్రాఫిక్ పోలీస్ కమిషనర్ విశ్వప్రసాద్, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ తన్వీ అరోరా అన్నారు. అరోరా పీజీ కాలేజీ(నాంపల్లి, పంజాగుట్ట) అలాప్ – 2024 పేరిట నిర్వహించిన ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థుల ప్రవేశ కార్యక్రమం సోమవారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అకాడమిక్ అడిట్ డైరెక్టర్ ప్రొ. బి.శ్రీనగేశ్, విశిష్ట అతిథులు నగర అదనపు ట్రాఫిక్ పోలీస్ కమిషనర్ విశ్వప్రసాద్, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ తన్వీ అరోరా హాజరై జ్యోతి ప్రజ్వలనం చేసి విద్యార్థులకు మెమోంటో, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో అరోరా గ్రూప్ వైస్ చైర్మన్ అనుదీప్ ఆరోరా, కార్యదర్శి నిమ్మటూరి రమేశ్‌బాబు, కాలేజీ డైరెక్టర్ డా. ప్రదోశ్ చంద్ర పట్నాయక్, ప్రిన్సిపాల్ డా. సుష్మా చౌదరి పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలను ఒకే కులస్తులుగా పరిగణించాలి

రవీంద్రభారతి : విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలను రాష్ట్ర ప్రభుత్వం వంచనకు గురిచేస్తున్నదని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్, గౌరవాధ్యక్షుడు లాలుకోట వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణామాచార్యులు సోమవారం పేర్కొన్నారు. ఈ నెల 6 నుంచి తలపెట్టిన కులగణన సర్వేలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలను ఒకే కులస్తులుగా పరిగణించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బీసీ కమిషన్, ప్లానింగ్ బోర్డుల ఆధ్వర్యంలో జరగనున్న బీసీ కులగణన ఎన్యుమరేషన్ ఫార్మాట్‌లో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలను కులంగా కాకుండా వృత్తులుగా పేర్కొనడం జరిగిందన్నారు. 6 నుంచి నిర్వహించే కులగణన సర్వేలో కమ్మరి, వడ్రంగి, స్వర్ణకార, ఇత్తడి, శిల్పి వృత్తులను సంప్రదాయ వృత్తులుగా చేర్చాలని డిమాండ్ చేశారు.

ఇబ్బందులు లేకుండా చూడాలి

ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ శాఖల అధికారులు పని చేయాలని నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హు స్సేన్ అన్నారు. రెడ్‌హిల్స్, చింతల్‌బస్తీ మార్కెట్‌లో ఫుట్‌పాత్ వ్యాపారులను జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు వేధిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో ఎమ్మెల్యే అక్కడికి చేరుకుని పోలీసులతో మాట్లాడారు. ఫుట్‌పాత్ వ్యాపారాలు చేసేవారు ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా వ్యాపారం చేసుకోవాలని సూచించారు. - మెహిదీపట్నం

గీత కార్పొరేషన్‌కు వెయ్యి కోట్లు కేటాయించాలి

కాచిగూడ : ప్రభుత్వం కల్లుగీత కార్మికుల సంక్షేమానికి గీత కార్పొరేషన్‌కు వెయ్యి కోట్ల రూపాయలను కేటాయించాలని తెలంగాణ గౌడ సంఘం జాయింట్ సెక్రటరీ